# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 126 | పేజీలు : 08 | బుధవారం | 13-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## నీట్ పేపర్ లీకేజీ, రద్దు

**కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు**

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం

పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్

2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్




## నా మాటలు వక్రీకరించారు: మంత్రి పొన్నం ప్రభాకర్




## నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా
# చర్యలు తప్పవు

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని దిశానిర్దేశం

కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశాలు

ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలన్నారు.ధాన్యం సేకరణలో జాప్యం : రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ధాన్యం




## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..

లొంగిపోయిన కీలక నేత




భార్యతో పాటు లొంగిపోయిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్

నరహరిది హనుమకొండ జిల్లా సోమిడి గ్రామం

అగ్రనేతలు గణపతి, మిసిర్ బెస్ర కోసం కొనసాగుతున్న గాలింపు




## కోర్టుకు హాజరు కావాలంటూ
# కవితకు నోటీసులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రైల్ రోకో

కవితపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు

విచారణకు రావాలంటూ సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సమన్లు

# జూన్ 2న రెండో విడత

పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్: మంత్రి పొంగులేటి

హైదరాబాద్‌లో ఇళ్ళ స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న మంత్రి

జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడి

విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామన్న మంత్రి




## నీట్ యూజీ 2026 పరీక్ష
# రద్దు..

మళ్లీ నిర్వహణకు ఎన్టీఏ నిర్ణయం




- ఈ నెల 3న జరిగిన నీట్ యూజీ 2026 ప్రవేశ పరీక్షను రద్దు చేసిన ఎన్టీఏ
- పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఈ నిర్ణయం
- సమగ్ర విచారణ కోసం సీబీఐకి అప్పగింత
- పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని, త్వరలో కొత్త తేదీలు ప్రకటిస్తామని వెల్లడి

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రాసిన నీట్ యూజీ 2026 ప్రవేశ పరీక్షపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 3న నిర్వహించిన ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారికంగా ప్రకటించింది.





## హైకోర్టును ఆశ్రయించిన
# బండి భగీరథ్

బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై పోక్సో కేసు

17 ఏళ్ల బాలికను వేధించాడంటూ కేసు నమోదు

కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

## ప్రజలు కోరితే మేము
# అంగీకరిస్తాం




**సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు**

- శబరిమల ఆచారాల్లో సంస్కరణ కావాలని ప్రజలు కోరితే మేము అంగీకరిస్తాం: సుప్రీంకోర్టు
- శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష కేసులో సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు
- ఈ సమస్యకు సామాజిక సంస్కరణలు అవసరమని ప్రజలందరూ ఏకతాటిపైకి వస్తే తాము అంగీకరిస్తామని వెల్లడి

హైదరాబాద్ పల్స్,డెస్క్

శబరిమలలోకి రుతుక్రమ వయసు గల మహిళలను మినహాయించడం ఒక నిషిద్ధం అవుతుందా? లేదా? అనేది అంతిమంగా వ్యక్తిగత మనస్సాక్షికి సంబంధించిన విషయమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ప్రజలు తమ ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ద్వారా ఈ పద్ధతికి సామాజిక సంస్కరణలు అవసరమని సమష్టిగా నిర్ణయిస్తే, అటువంటి సంస్కరణలను కోర్టు అంగీకరించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళ వివక్షపై దాఖలైన పిటిషన్లు, దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటిస్తున్న మత స్వేచ్ఛ పరిధి, విస్తృతికి సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా,

## ఢిల్లీ హైకోర్టుకు అక్కినేని నాగార్జున..




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తన వ్యక్తిగత హక్కులకు (పర్సనాలిటీ రైట్స్) భంగం కలిగిస్తున్నారంటూ ఢిల్లీ హైకోర్టును సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పేరు, ఫొటోలను వాడుకుంటున్నారని హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో
# కేసీఆర్ భేటీ

- ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్
- పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం
- పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై




## ఏం టేకాఫ్ అవుతుందో
# ఊహించగలరా?

పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ

మే 15న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఈ ప్రాజెక్టుతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు

పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా అంటూ లోకేష్ ట్వీట్

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ..

మొదటి పేజీ తరువాయి

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ సుమారు మూడు దశాబ్దాల అజ్ఞాత జీవితానికి స్వస్తి పలికి పోలీసుల ఎదుట లొంగిపోయారు. తెలంగాణలోని హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడికి చెందిన నరహరి, 1996 నుంచి మావోయిస్టు పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఝార్ఖండ్‌లోని సరండా అడవుల్లో భద్రతా బలగాలు పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిర్ బెస్ర కోసం ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో నరహరి తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. గత 28 ఏళ్లుగా పార్టీలో పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్న ఆయన, కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు.నరహరి లొంగుబాటు పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టు అగ్రనేతలు ముప్పాళ్ల లక్ష్మణరావు (గణపతి), మిసిర్ బెస్ర వంటి వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అటు చత్తీస్‌గఢ్, ఇటు ఝార్ఖండ్ సరిహద్దుల్లో బలగాల పహారా పెరగడంతో మరికొందరు నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చే అవకాశం ఉందని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# కోర్టుకు హాజరు కావాలంటూ కవితకు నోటీసులు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి.కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. ఈరోజు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.

# నీట్ పేపర్ లీకేజీ, రద్దు

మొదటి పేజీ తరువాయి

వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్–యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు.ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# జూన్ 2న రెండో విడత

మొదటి పేజీ తరువాయి

పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన (బుధవారం) హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. న్యాయస్థానం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కేసు వివరాల్లోకి వెళితే... ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను భగీరథ్ తరపున వర్గాలు ఖండిస్తున్నాయి. ఇది కావాలని చేస్తున్న కుట్రగా వారు పేర్కొంటున్నారు.మరో ఆసక్తికరమైన మలుపు ఏంటంటే... ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు (మే 8) కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.

# నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు..

మొదటి పేజీ తరువాయి

పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని, కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించింది.పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 8న ఈ అంశాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎన్టీఏ తెలిపింది. కేంద్ర ఏజెన్సీలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నుంచి అందిన సమాచారం, దర్యాప్తు నివేదికల ఆధారంగా పరీక్ష ప్రక్రియ విశ్వసనీయతను కాపాడలేమని నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఎన్టీఏ తన ప్రకటనలో వివరించింది.పరీక్ష రద్దు నిర్ణయం విద్యార్థులకు, వారి కుటుంబాలకు అసౌకర్యం కలిగిస్తుందని అంగీకరించిన ఎన్టీఏ, జాతీయ పరీక్షా వ్యవస్థపై విశ్వసనీయతను, సమగ్రతను కాపాడేందుకు ఇది తప్పనిసరి అని పేర్కొంది. దర్యాప్తునకు సీబీఐకి పూర్తి సహకారం అందిస్తామని, అవసరమైన అన్ని రికార్డులను అందజేస్తామని హామీ ఇచ్చింది.

**విద్యార్థుల నుంచి అదనపు ఫీజు వసూలు చేసేదిలేదు.. పాత రిజిస్ట్రేషన్లే వర్తిస్తాయి: ఎన్టీఏ**

మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం విద్యార్థులు కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని ఎన్టీఏ స్పష్టం చేసింది. పాత రిజిస్ట్రేషన్ వివరాలే చెల్లుబాటు అవుతాయని, అదనపు పరీక్ష ఫీజు కూడా వసూలు చేయబోమని తెలిపింది. అంతేగాక ఇప్పటికే చెల్లించిన ఫీజును విద్యార్థులకు తిరిగి వాపసు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కొత్త పరీక్ష తేదీలు, అడ్మిట్ కార్డుల జారీకి సంబంధించిన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే అనుసరించాలని, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అనధికారిక సమాచారాన్ని నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది.

# ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. "మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?" అంటూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. దీనికి జతగా, ఓ అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఆకాశంలోకి దూసుకెళ్తున్న ఏఐ (ఏఐ) వీడియోను కూడా పంచుకున్నారు. ఈ పోస్ట్ ద్వారా పుట్టపర్తిలో రాబోతున్న భారీ ప్రాజెక్టుపై ఆయన అంచనాలను పెంచారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతంలో సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పాదనను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో, మంత్రి నారా లోకేష్ చేసిన ఈ టీజర్ ట్వీట్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది.

# ఢిల్లీ హైకోర్టుకు అక్కినేని నాగార్జున..

మొదటి పేజీ తరువాయి

ఓ బట్టల వ్యాపారి దుస్తులపై తన చిత్రాలు, పేరు వాడుతున్నాడని కోర్టు దృష్టికి నాగార్జున తీసుకెళ్లారు. ఈ కేసుపై నేడు విచారణ చేపట్టిన న్యాయస్థానం సదరు వ్యాపారిపై సీరియస్ అయ్యింది.నాగార్జున టీ షర్టులు మీరెలా అమ్ముతారంటూ వ్యాపారిని హైకోర్టు ప్రశ్నించింది. ఫొటోలను వాణిజ్యపరంగా వాడుకునే అధికారం మీకు ఎవరిచ్చారంటూ కోర్టు నిలదీసింది. తొలుత వ్యాపారి తరఫు న్యాయవాది శృతి అయ్యర్ వాదనలు వినిపిస్తూ 'ది ఘోస్ట్' సినిమాకు తాము అధికారిక మర్చండైజింగ్ భాగస్వాములమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాబట్టి తమకు కేసు నుంచి మినహాయింపు ఇవ్వాలని అభ్యర్థించారు. ఓ మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా ప్రొడక్షన్ హౌస్‌తో తమకు ఒప్పందం ఉందని.. నాగార్జున స్వయంగా ఆ వస్తువులను ప్రమోట్ చేశారని స్పష్టం చేశారు. దీనిపై నాగార్జున తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒప్పంద పత్రాలు అడిగినప్పటికీ సమర్పించలేదని, కోర్టుకు ఇచ్చిన ఈ-మెయిల్ కాపీలు సైతం అసంపూర్ణంగా ఉన్నాయని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.చివరికి, ఈ వ్యవహారంలో తమకు నాగార్జునతో కానీ, సంబంధిత నిర్మాణ సంస్థతో కానీ ఎటువంటి ప్రత్యక్ష ఒప్పందం లేదని న్యాయస్థానం ముందు వ్యాపారి అంగీకరించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. నాగార్జున, ప్రొడక్షన్ హౌస్‌తో ప్రత్యక్ష ఒప్పందం లేదని మీరే అంగీకరిస్తున్నప్పుడు.. టీ షర్టులను విక్రయించే చట్టబద్ధత ఎక్కడి నుంచి వచ్చిందని సీరియస్ అయ్యింది. అనంతరం తదుపరి విచారణను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేసి

# బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది.ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజలు కోరితే మేము అంగీకరిస్తాం

మొదటి పేజీ తరువాయి

జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చిలతో కూడిన 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

**రుతుక్రమ వయసే అసలు సమస్య**

ఈ కేసులో కొన్ని పక్షాల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది విజయ్ హన్సరియా కీలక వ్యాఖ్యలు చేశారు. శబరిమల ఆలయం విషయంలో మహిళలపై ఆంక్షలు విధించడానికి గల ముఖ్య కారణం వారి రుతుక్రమ వయసేనని అన్నారు. "నన్ను ఒక 10 ఏళ్ల బాలికగా పరిగణించండి. నేను కుటుంబంతో కలిసి ఆలయానికి వెళ్తున్నాను. రుతుక్రమం వయసొచ్చిన తర్వాత నేను ఆలయానికి వెళ్లడం నిషిద్ధం" అని హన్సరియా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు పదేళ్ల వయసులో ఆలయంలోకి ప్రవేశించడాన్ని నిషిద్ధంగా భావిస్తే అది నిషిద్ధమే. అలా భావించకపోతే ఏదీ కాదు. మీరు దానిని ఎలా చూస్తారన్నదే ప్రశ్న. ఒక భక్తుడు, భక్తుడు కానివారు దానిని ఎలా చూస్తారన్నదే దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ మనస్సాక్షిని అనుసరించాలి" అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు.తాను ఒక భక్తుడినే అయినా, కొందరు శబరిమల ఆలయంలోకి రుతుక్రమం అయ్యే మహిళలు ప్రవేశించడం నిషిద్ధమని అంటారని సీనియర్ అడ్వకేట్ విజయ్ హన్సరియా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని తన మనస్సాక్షి నిషిద్ధంగా గానీ, కళంకంగా గానీ పరిగణించదని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం రూపొందించిన రాష్ట్ర చట్టాన్ని, అది మతపరమైన ఆచారాలను ప్రభావితం చేస్తుందన్న ఏకైక కారణంతో కొట్టివేయకుండా సమర్థించాలని సుప్రీంకోర్టును కోరారు. "ఇది ఒక మతపరమైన ఆచారం. దీనికి సామాజిక సంస్కరణ అవసరం. అయినప్పటికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 2(బి) కింద ఒక చట్టం చేసినప్పటికీ అది ఒక ఆవశ్యక మతపరమైన ఆచారం అనే కారణంతో ఆ చట్టాన్ని కొట్టివేయలేం. ఎందుకంటే ఆర్టికల్ 26 (బి), ఆర్టికల్ 25 (1)తో పాటు ఆర్టికల్ 26ను కూడా ఆ ఆచారం అధిగమిస్తుంది" అని విజయ్ హన్సరియా తెలిపారు.

**సీజేఐ కీలక వ్యాఖ్యలు**

ఉదాహరణకు, ఏదైనా రాష్ట్రం అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి ప్రవేశాన్ని అనుమతిస్తూ చట్టం చేస్తే అది ఆర్టికల్ 26 (బి)ని ఉల్లంఘిస్తోందనే కారణంతో ఆ చట్టాన్ని కొట్టివేయవచ్చా? అని హన్సరియా సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సమాధానమిచ్చారు. అలాంటప్పుడు భవిష్యత్తులో న్యాయస్థానాలు తీర్పు వెలువరించడానికి సంకోచిస్తాయని అభిప్రాయపడ్డారు. "ఈ దేశ ప్రజలు తమ ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ద్వారా శబరిమలలో మహిళల ప్రవేశంపై ఆంక్షల సమస్యకు సామాజిక సంస్కరణలు అవసరమని ఏకతాటిపైకి వచ్చినట్లైతే న్యాయస్థానం దానిని ఒక సామాజిక సంస్కరణగా అంగీకరిస్తుంది. కానీ అది ప్రజల కోరికలకు, అభీష్టానికి వ్యతిరేకంగా ఉంటే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

# నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలు తప్పవు

మొదటి పేజీ తరువాయి

సేకరణలోని సమస్యలపై వివరాలను తెలుసుకున్నారు. గత కొద్ది రోజులుగా ధాన్యం సేకరణలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతన్నలు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం పూర్తి వివరాలను ఆయా జిల్లా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

**లారీలు అందుబాటులో ఉండాలి**

సేకరించిన ధాన్యాన్ని తరలించేందుకు సరిపడా లారీలను అందుబాటులోకి తీసుకురాని కాంట్రాక్టర్లను ఉపేక్షించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని ఆదేశించారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్?కు ఆదేశాలు జారీ చేశారు.ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గిడ్డంగుల సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**ధాన్యం సేకరణ సాఫీగా జరగాలి**

సేకరించిన ధాన్యాన్ని తాత్కాలికంగా రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్‌కు తరలించాలని సీఎం సూచించారు. వెసులుబాటు ఆధారంగా అక్కడి నుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దని చెప్పారు. అవసరమైన చోట పోలీసుల సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్ కు నివేదికలు పంపాలని తెలిపారు.అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని సీఎం తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు.

# నా మాటలు వక్రీకరించారు: మంత్రి పొన్నం

మొదటి పేజీ తరువాయి

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు.మంగళవారం హైదరాబాద్ వేదికగా మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు.ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# విద్యార్థుల ప్రతిభ ను ప్రోత్సహిస్తూ అభినందన సభ ఏర్పాటు

**కుత్బుల్లాపూర్, మే 12, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ లోని ప్రభుత్వ పాటశాలలో ఈరోజు భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 10వ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా లోనే మొదటి స్థానం సంపాదించిన విద్యార్థికి మరియు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం, అభినందన సభ నిర్వహించారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను సన్మానించి, నగదు పురస్కారాన్ని అందచేసారు. ముఖ్యంగా భౌరంపేట్‌కు చెందిన ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీ నారాయణకు రూ.50,000 నగదు పురస్కారం అందజేశారు. అలాగే మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490 పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను అందజేసి వారి ప్రతిభను



కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మీరు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాటశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్, మిద్దెల మల్లారెడ్డి, కటకం విరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే జిఎంఆర్

## పటాన్చెరు డివిజన్ లో 2 కోట్ల 19 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12 :** నియోజకవర్గ పరిధిలోని సబ్బండ వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఒక కోటి రూపాయల అంచన వ్యయంతో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అనంతరం ఒక కోటి 19 లక్షల రూపాయలతో నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘం, ముదిరాజ్ సంఘం, ఎస్సీ సంఘం స్మశాన వాటికల ప్రహరీ గోడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, మార్కెట్ కమిటీ




మాజీ చైర్మన్ విజయ్ కుమార్, డిఈ కృష్ణవేణి, బి ఆర్ ఎస్ ఆర్ పార్టీ సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, శ్యామ్, ఎట్టయ్య, వెంకటేష్, శంకర్, రామ్మోహన్, షకీల్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఐదుగురు మృతి, ఐదుగురు పరిస్థితి విషమం.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, జహీరాబాద్ :** తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బీదర్ - జహీరాబాద్ ప్రధాన రహదారిపై వేగంగా వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఒక బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి బస్సు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కకు బోల్తా పడటంతో అక్కడికక్కడే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. స్థానికుల సమాచారం ప్రకారం.. బస్సు అతివేగంగా ఉండటమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. బైక్‌ను ఢీకొట్టిన తర్వాత డ్రైవర్ బస్సును అదుపు చేయలేకపోవడంతో అది పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి ప్రస్తుతం చాలా విషమంగా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న భయం వ్యక్తమవుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సు కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడం ప్రత్యక్ష సాక్షులను కలచివేసింది. సరిహద్దు ప్రాంతం కావడంతో అటు




కర్ణాటక, ఇటు తెలంగాణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఒకే ప్రమాదంలో ఐదుగురు చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. రద్దీగా ఉండే ఈ రహదారిపై వేగ నియంత్రణ లేకపోవడం వల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి జన్మోత్సవ వేడుకలు


## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం
## శ్రీ స్వామివారి నామస్మరణతో మార్మోగిన ప్రాంతం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామి వారి జన్మోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వైదిక బ్రాహ్మణులు ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ శాశ్వత అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దాతల సహకారంతో



జరిపారు. శ్రీ ఆంజనేయ స్వామి వారికి ఉత్సవ మూల విగ్రహాలకు పంచామృత, మాన్య సూక్త అభిషేకాలు, అష్టోత్తర శత నాగవల్లి దళార్చన, వడమాల సమర్పణ, విశేషాలంకరణ, హనుమాన్ చాలీసా పారాయణం,



మహా నైవేద్య నివేదన పూర్ణహుతి, మాన్య సూక్త మూలమంత్ర హవనములు, మహదాశిర్వచనం తీర్థ ప్రసాద వితరణ అన్న ప్రసాద వితరణ, రాత్రి పల్లకి సేవ మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు .





# బడి బాట కార్యక్రమం..గిరిజన పాఠశాలల్లో చేరికకు ఉపాధ్యాయులకు నిర్దేశాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రగతి ప్రణాళిక ప్రజా పాలనా విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాల, మొవాడ్, ఫరిది స్కూల్ కాంప్లెక్స్‌ల ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పీఎంఆర్సీ, ఏసీఎంఓ పూర్కా ఉద్దవ్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు, బడి బయట పిల్లలు అందర్నీ ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలని స్పష్టం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ఇంటింటికి వెళ్లి విద్యార్థులను పాఠశాలకు తీసుకురావాలని, అంగన్వాడీ కేంద్రాల్లో బడి ఈడు పిల్లలను నమోదు చేసుకోవాలని నిర్దేశించారు. ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, సన్నబియ్యం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పవార్ లింబారావ్, ఎస్సీఆర్పీలు రాథోడ్ రవీందర్, కూడ్మె అనంత్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఔట్ స్టాండింగ్ అవార్డు అందుకున్న జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్




**కుత్బుల్లాపూర్, మే 12, హైదరాబాద్ పల్స్ న్యూస్**
కుత్బుల్లాపూర్ జీడిమెట్ల పోలీసులకు ఔట్ స్టాండింగ్ సర్వీస్ అవార్డు అందించిన తల సేమియా సొసైటీ హైదరాబాద్. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించినటువంటి రక్తదాన శిబిరంలో 423 యూనిట్ల రక్తాన్ని సేకరించి తద్వారా ఎంతో మంది చిన్నారులకు రక్తాన్ని అందించినందుకు గాను తల సేమియా దినోత్సవం పురస్కరించుకొని ఈ యొక్క అవార్డును అందించడం జరిగింది. ఎక్కువ మొత్తంలో రక్త యూనిట్లను సేకరిస్తున్నటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహించినటువంటి వారికి ఈ అవార్డు అందించడం జరుగుతుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుండి అత్యధిక రక్తం యూనిట్లను సేకరిస్తున్నను గాను ఈ యొక్క అవార్డు నిజం జరిగింది. ఈ సందర్భంగా జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ ఈ యొక్క అవార్డు రావడానికి కారణం అయినటువంటి జీడిమెట్ల ప్రాంత ప్రజలందరికీ అలాగే ఆరోజు రక్తదానం చేసినట్టు రక్తదాతలు అందరికీ ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడానికి సహకరిస్తున్నటువంటి దాతలు అందరికీ కార్యక్రమం ఈ స్థాయిలో నిర్వహించడానికి మార్గ నిర్దేశం చేసినటువంటి ఉన్నతాధికారులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.

# జయభేరి కాలనీ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న డ్రైనేజ్ లీకేజ్ సమస్య



**కుత్బుల్లాపూర్, మే 12, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** కుత్బుల్లాపూర్ కొంపల్లి జయభేరి కాలనీలోని కస ఉజ్జయిని అపార్ట్మెంట్ సమీపంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజ్ నీరు భారీగా లీక్ అవుతూ కాలనీ మొత్తం వ్యాపిస్తోంది. ఈ కలుషిత నీరు రోడ్లపై ప్రవహిస్తూ తీవ్రమైన దుర్వాసనతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తోంది. ప్రతిరోజూ ఈ మురుగు నీరు కాలనీలోకి చేరడంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా డెంగ్యూ, వైరల్ ఫీవర్స్, దోమల పెరుగుదల వంటి సమస్యలు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి, సంబంధిత డ్రైనేజ్ అధికారులను జయభేరి కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, కాలనీ పరిశుభ్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకొని డ్రైనేజ్ లీకేజీని అరికట్టాలని డిమాండ్ చేస్తున్నాము అని కాలనీ వాసులు అన్నారు

# లకడారం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12:**
ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని. లకడారం గ్రామంలో కొలువైన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణ, శంకర్ గౌడ్, రాములు గౌడ్, నవీన్ రెడ్డి, గౌడ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మూడు లక్షల 25 వేల రూపాయల విలువైన ఎల్ఓసి లను అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12:**
నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర కుమార్, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామానికి చెందిన సుజాతలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వారికి మంజూరైన మూడు లక్షల 25 వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, యునూస్, రాజు పాల్గొన్నారు.

# ఆదర్శ డివిజన్ గా ముత్తంగి

## ముత్తంగిలో 84 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12:**
ముత్తంగి డివిజన్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని డి ఎన్ కాలనీ, సాయి ప్రియా కాలనీ, పార్థ కాలనీలలో 84 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యుజిడి నిర్మాణ పనులకు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కాలనీలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఈ ఈ సురేష్, డిఈ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిట్టు, అమ్జాద్, ఆయా కాలనీల అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పథకం అమలులో ప్రభుత్వం విఫలం : ఎమ్మెల్యే కూనంనేని



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ప్రజా దాహార్తిని తీర్చేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకం పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ తీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. నిధుల మంజూరు విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన నిలదీశారు. నీటి సమస్య పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పక్కన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలు అల్లాడకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, అయితే ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేశ్, శివయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# తిర్యాణిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచంద్ర



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం చింతపల్లి రైతు వేదికలో మంగళవారం అన్నదాతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో పంటలు సాగు చేసుకోవాలని ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచంద్ర రైతులకు సూచించారు. శాస్త్రవేత్తల అనుభవం సాగులో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చిక్రం కృష్ణారావు, మడావి పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ టెన్త్ శ్రీనివాస్, నాయకపుగూడ ఉప సర్పంచ్ పవన్ నంద, వ్యవసాయ అధికారి వినయ్, ఏఈఓలు వినోద్ కుమార్, ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు కూన సురేష్, కనుకుంట్ల సత్యం తదితరులు పాల్గొన్నారు

# నీట్ పరీక్ష రద్దు బాధ్యత కేంద్రానిదే : ఎంపీ చామల



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ భాధ్యత వహించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాజస్థాన్ లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు బీజేపీకి పట్టదా? మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారు. ఈ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్ ను కోల్పోయే అవకాశం ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ లు ఇప్పించి పరీక్ష రాయించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి పట్టదా? నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి అని ఎంపీ చామల సూచించారు. నీట్ పరీక్ష రద్దు పై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలి. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలి. ఆ పార్టీకి పాలనపై చిత్తశుద్ధి లేదు. రాజస్థాన్ లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అని ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జనగణన వివరాలు పూర్తిగా గోప్యం : కలెక్టర్ ప్రతీక్ జైన్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర మరియు ఖచ్చితమైన సమాచారం దేశాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మే 10 వరకు స్వీయ గణన నిర్వహించగా, మే 11 నుంచి ఇంటింటి గణన ప్రారంభమైందన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేశామని తెలిపారు. ప్రజలు జనగణన సిబ్బందికి సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు. జనగణనలో సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాల రూపకల్పన మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం బాధ్యతగా పాల్గొని జనగణన విజయవంతానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
హనుమాన్ జయంతి పర్వదినం భక్తిశ్రద్ధల సమాహారమని, ఆధ్యాత్మికతతో పాటు ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యత పెరగాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో హనుమంతుడు ధైర్యానికి, నిస్వార్థ భక్తికి నిలువుటద్దమని కొనియాడారు. సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసినప్పుడే ధర్మ రక్షణ సాధ్యమవుతుందని, ఆ దిశగా ఆలయ కమిటీలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించి, నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు దేవాలయ కమిటీలు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, నాయకులు మొహమ్మద్ యూసుఫ్, బోయిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షురాలు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, సిద్ధిపేట జిల్లా:**
డిసిసి అధ్యక్షురాలు తూముకుంట అంశారెడ్డి జన్మదిన సందర్భంగా వర్గల్ మండలంలోని మల్లారెడ్డిపల్లి లో సర్పంచ్ దాసరి విజయలక్ష్మి యాదగిరి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు చల్లటి పానీయాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదిన సందర్భంగా గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి స్కూల్ మెయిన్ రోడ్డు వద్ద దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలు ఎవరైతే ఉన్నారో వారందరికీ మజ్జిగ. తంసప్ చల్లని నీరు క్యాన్లను అందజేసి రోజూ కూల్ క్యాన్లు తో నీటిని అందిస్తామని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్ప సత్యనారాయణ సంతోష్ వార్డు సభ్యులు యువత తదితరులు పాల్గొన్నారు

# భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాచలం, వెంకటేశ్వర కాలనీలోని శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో విశేష పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన కార్యక్రమాలు హనుమాన్ జయంతి ని పురస్కరించుకుని స్వామి వారికి విశేషంగా ఆకు పూజ నిర్వహించారు.


**సీతారాముల కల్యాణ మహోత్సవం:** లోక కల్యాణం కోసం శ్రీ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా, కనుల పండువగా నిర్వహించారు.

**అన్న ప్రసాద వితరణ:** కల్యాణం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

**భక్తుల సందడి:**ఈ వేడుకను తిలకించడానికి భద్రాచలం పరిసర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి పునీతులయ్యారు.

ముఖ్య అతిథులు పాల్గొన్న వారు:


**అన్న ప్రసాద వితరణ దాత:లి బోగాల శ్రీనివాస రెడ్డి దంపతులు.**



ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు. వారిలో ముఖ్యులు: భోగాల శ్రీనివాస రెడ్డి, విష్ణుమొలకల రామ్ ప్రసాద్, రేపాక రాంబాబు, రేపాక రవికిరణ్, రేపాక సతీష్, పునేం కృష్ణ సర్పంచ్, వెంకటేశ్వర్లు తాసిల్దార్ పుల్లయ్య ఆర్టీవో, తాండ్ర నరసింహారావు,అన్నెం రామిరెడ్డి, రాసమళ్ల రాము,పద్మ, వసంతల రాజేశ్వరి, తుమ్మల రాణి, వీరితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్త సమాజం స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# చమురు, గ్యాస్, విద్యుత్ సంక్షోభం వేళ...
# దేశవ్యాప్తంగా జూన్ 13 వరకు 'స్మార్ట్ లాక్ డౌన్'..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12 :**
పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం కారణంగా ప్రపంచ దేశాలు చమురు, గ్యాస్ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న పాకిస్థాన్ లో ఇప్పుడు పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా పరిస్థితులు మరింతగా దిగజారాయి. సంక్షోభం నుంచి బయటపడేందుకు ఇటీవల పాకిస్థాన్ ప్రభుత్వం స్మార్ట్ లాక్ డౌన్ ను విధించిన విషయం తెలిసిందే. రాత్రి 8 గంటల వరకే దుకాణాలు, షాపింగ్ మాల్స్ తెరిచి ఉంటాయి. అలాగే ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్, పనిదినాలను నాలుగు రోజులకు కుదింపు, విదేశీ ప్రయాణాలపై నిషేధం ఇలా అనేక కఠిన నిర్ణయాలు తీసుకుంది.అయితే మార్చి 9 పాకిస్థాన్ లో విధించిన స్మార్ట్ లాక్ డౌన్ ను తాజాగా పాకిస్థాన్ ప్రభుత్వం జూన్ 13 వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. చమురు, గ్యాస్, విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా కీలక ఆంక్షలు విధించారు.ప్రభుత్వ వాహనాలకు ఇచ్చే ఇంధన కోటాను 50 శాతం తగ్గించారు. అలాగే 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్లపైకి రాకుండా నిలిపివేశారు. విదేశీ ప్రయాణాలపై నిషేధం పొడిగింపు.. మంత్రులు, ప్రభుత్వ అధికారులు అత్యవసరం అయితే తప్ప విదేశాలకు వెళ్లకూడదు. ఇక అన్ని శాఖలు తమ ఖర్చులను 20 శాతం తగ్గించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొత్త వాహనాలు, ఏసీలు, ఫర్నీచర్ కొనుగోళ్లపై నిషేధం విధించారు.ఇక ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలోని సంస్థల ఉద్యోగుల జీతాల్లో 5 శాతం నుంచి 30 శాతం వరకు కోత విధించారు. అటు ఎంపీల జీతాల్లోనూ 25 శాతం కోత విధించే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. ఇక పాకిస్థాన్ వ్యాప్తంగా పని దినాలను నాలుగు రోజులకు కుదించారు. అలాగే సామాన్యులపై భారం పడకుండా మోటార్ సైకిలిస్టులు, పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ ఆపరేటర్లకు




ఇచ్చే చమురు సబ్సిడీలను ఒక నెలపాటు పొడిగించారు.మరోవైపు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం కారణంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా పౌరులను బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, బంగారం కొనుగోళ్లు ఆపడం, స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం, అలాగే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు.

# పాక్ విషయంలో చైనాకు భారత్ సీరియస్ వార్నింగ్..!
## సిందూర్ లో సపోర్ట్ పై..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, న్యూఢిల్లీ:**
గతేడాది ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్తాన్ కు చైనా అందించిన మద్దతుపై భారత్ ఇవాళ మరోసారి తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక వసతులను కాపాడేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు దాని 'ప్రతిష్ట, స్థాయి'పై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించింది. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్తాన్‌కు చైనా ప్రత్యక్ష మద్దతు ఇచ్చిందని ఇటీవల అంగీకరించిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది.ఈ అంశంపై నివేదికలు గతంలో తెలిసిన వాటిని ధృవీకరించాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను రక్షించే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం వల్ల తమ ప్రతిష్ట, స్థాయి ఎలా ప్రభావితమవుతుందో బాధ్యతాయుతమైన దేశాలు ఆలోచించుకోవాలని జైస్వాల్ సూచించారు. ఆపరేషన్ సింధూర్ గతేడాది పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడికి ఒక "ఖచ్చితమైన, క్రమబద్ధమైన" ప్రతిస్పందన అని ఆయన తెలిపారు. పాకిస్తాన్ నుండి దాని ఆదేశాల మేరకు పనిచేస్తున్న ప్రభుత్వ-ప్రోత్సహక ఉగ్రవాద మౌలిక వసతులను ధ్వంసం చేయడమే దీని లక్ష్యం అన్నారు.ఈ సంఘర్షణలో చైనా చురుకైన పాత్రను జూలై 4న లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ మొదటిసారి వెల్లడించారు. డి.జి.ఎమ్.ఓ – స్థాయి చర్చలు జరుగుతున్నప్పుడు, చైనా నుండి మన సైనిక విస్తరణపై పాకిస్తాన్‌కు ప్రత్యక్ష సమాచారం అందింది. కాబట్టి మనం త్వరగా స్పందించి తగిన చర్య తీసుకోవాలని ఆయన కోరారు. ఈ యుద్ధంలో టర్కీ కూడా పాలుపంచుకుందని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ వెల్లడించారు. అది పాకిస్తాన్‌కు బాయ్రాక్టర్ డ్రోన్‌లను సరఫరా చేసింది. గత వారం సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం చైనా ఇంజనీర్లు ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్తాన్ తో కలిసి పనిచేసినట్లు అంగీకరించారు.



# దేశాభివృద్ధి కే ప్రధాని పొదుపుసూత్రాలు

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, మెయిన్ డెస్క్ :**
విదేశీ మారక నిల్వలను ఆదా చేసుకునేందుకు బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలని, విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని ప్రధాని చేసిన విజ్ఞప్తి ని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామ్ చందర్ రావు సమర్థించారు. మంగళవారం తెలంగాణా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రధాని తెలంగాణలో పర్యటించినప్పుడు చేసిన వాఖ్యలను ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్తుతుల్లో బంగారం కొనుగోలు చేయ కూడదు, విదేశీ ప్రయాణాలను మానుకోవాలని ప్రధాని చేసిన విజ్ఞప్తి వల్ల మన దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని రామ్ చందర్ రావు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన, రేషనింగ్ వల్ల పెరుగుతున్న ధరలను తగ్గించుకోవడానికి ప్రధాని తెలంగాణ పర్యటనలో పొదుపు సూత్రాలు చెప్పారని రామ్ చందర్ రావు అన్నారు. ప్రస్తుతం దేశం ఆర్థిక సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. సంక్షోభం లేనిసమయంలో బియ్యం ఒక్కసారే కొనుగోలు చేయాలని, ప్రజలు ఒక్కపూటే భోజనం చేయాలని కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిని రామ్ చందర్ రావు తప్పు పట్టారు. 1960 దశకం లో ఇండో పాక్ యుద్ధ సమయంలో లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రధానిగా ఉన్నప్పుడే సంక్షోభం వచ్చినప్పుడు ప్రజలు బియ్యం ఒక్కసారే కొను గోలు చేయాలి, ఒక్క పూట మాత్రమే భోజనం చేయాలి అని కాంగ్రెస్ ప్రభుత్వం కోరిన విషయాన్ని రామ్ చందర్ రావు గుర్తు చేశారు. తెలంగాణా సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ప్రధాని ప్రసంగిస్తూ దేశం కోసమే ప్రధాని పొదుపు సూత్రాలను వెల్లడించినట్టు ఎన్ .రామ్ చందర్ రావు పేర్కొన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యలను బీజేపీ అధ్యక్షుడు తప్పు పట్టారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎదురైన సంక్షోభాలను వారి మంత్రులు, నాయకులు పున సమీక్షించుకోవాలని రామ్ చందర్ రావు సూచించారు.స్వదేశీ ఉత్పత్తులను వినియోగించుకోవాలని, వంట నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని వాఖ్యలు చేసిన నేపథ్యం లో బీజేపీ అధ్యక్షుడు ఈ వాఖ్యలు చేశారు. రసాయన ఎరువుల దిగుమతులకు విదేశీ మాదక ద్రవ్యాన్ని గణనీయంగా ఖర్చు అవుతుందని రామ్ చందర్ రావు అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించడం వల్ల ఇంధన చార్జీలను గణనీయంగా తగ్గించుకోవచ్చని ప్రధాని చేసిన సూచన బీజేపీ అధ్యక్షుడు గుర్తు చేశారు.




# సారపాక లో ఘోర రోడ్డు ప్రమాదం

**శివకుమార్ రెడ్డి పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గంపహడ్ మండల పరిధిలో గల సారపాక గ్రామం శ్రీరాంపురం కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. జమాయిల్ పుల్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ యూ టర్న్ తీసుకునే సమయంలో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో శివకుమార్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మొదట భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి మరింత విషమించడంతో అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన జమాయిల్ పుల్ల ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.




# ఆనందోత్సవాల మధ్య హనుమాన్ జయంతి ఉత్సవాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, సిద్దిపేట జిల్లా:**
వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి క్షేత్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు దేవరాజ్ ప్రవీణ్ శర్మ సంజు కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆంజనేయస్వామి జయంతి వేడుకల్లో సందర్భంగా స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాలు తో విశేష మన్యసూక్త పారాయణ యుక్తంగా అభిషేకం విశేష అలంకరణ ధవలార్చన మన్యసూక్త వనము నిర్వహించినట్లు అలాగే హనుమాన్ దీక్ష స్వాములు సుమారు 45 మంది దీక్షా విరమణ కోసం ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ శోభాయాత్ర నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వాములు గ్రామ భక్త బృందం దీక్ష స్వాములు యొక్క కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు తక్షణమే న్యాయం చేయాలి : పవన్ కల్యాణ్

**ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు**

**బంగ్లాదేశ్‌లో 500 రోజులకు పైగా జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, సెంట్రల్ డెస్క్:**
బంగ్లాదేశ్‌లో 500 రోజులకు పైగా జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆయనకు వైద్య సహాయం అందించడంతో పాటు, వెంటనే బెయిల్ మంజూరు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. "500 రోజులకు పైగా జైలు, పదేపదే బెయిల్ నిరాకరణ. ఆయన తరఫు న్యాయవాదులను కూడా కోర్టు హాలులో బెదిరిస్తుంటే ఇక న్యాయం ఎలా జరుగుతుంది? మైనారిటీ హిందూ సమాజం హక్కుల కోసం పోరాడటం నేరమా?" అని ప్రశ్నించారు. కాషాయ వస్త్రాలు ధరించిన ఒక ఆధ్యాత్మిక గురువును నేరస్థుడిలా చూస్తూ, ఆయన గొంతు నొక్కుతుంటే ప్రపంచం మౌనంగా ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. కొన్ని అంశాలపై హ్యాష్‌ట్యాగ్‌లతో రాత్రికి రాత్రే స్పందించే నకిలీ సెక్యులరిస్టులు, సెలెక్టివ్ మానవ హక్కుల కార్యకర్తలు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? వారి మానవత్వానికి కూడా ఫిల్టర్ ఉందా? అని పవన్ కల్యాణ్ విమర్శించారు

# 50 వేల మంది ఆటో డ్రైవర్లు, బ్యూటీ పార్లర్ మహిళలు...

## బెంగాల్ లో బీజేపీ గెలుపు వెనుక ఆర్.ఎస్.ఎస్ బిగ్ స్కెచ్!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, సెంట్రల్ డెస్క్:** ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఫలితాల్లో బీజేపీ పార్టీ ప్రభంజనం సృష్టించింది. బెంగాల్?లో కాషాయజెండా ఎగురవేయాలన్న తమ చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ ఎన్నికల్లో సునామీ సృష్టించింది. మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనుకు ఎండ్ కార్డు వేస్తూ మొత్తం 294 అసెంబ్లీ స్థానాలున్న బెంగాల్?లో బీజేపీ ఏకంగా 207 స్థానాల్లో ఘన విజయం సాధించి ల్యాండ్ స్లైడ్ విక్టరీని నమోదు చేసింది. 2021 ఎన్నికల్లో కేవలం 77 స్థానాలకు పరిమితమైన కమలం పార్టీ ఐదేళ్లలో ఏకంగా 207కు ఎగబాకడం వెనుక తృణమూల్ వైఫల్యాలతో పాటు బీజేపీకి ఆర్ఎస్ఎస్ బలమైన అండగా నిలవడమే ప్రధాన కారణం అనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ దీదీని గద్దె దించడం కంటే తాము అధికారంలోకి రావాలన్న పట్టుదలతో పని చేసిన ఆర్ఎస్ఎస్ ఇందుకోసం ప్రణాళికలు రచించి వాటిని ఏడాది క్రితం నుంచే అమలు చేసినట్లు తెలుస్తోంది.

**సైలెంట్ క్యాంపెయిన్:**

ఈసారి బెంగాల్ ఎన్నికలను నరేంద్ర మోడీ, అమిత్ షా అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ ఇద్దరి బహిరంగ సభలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనుబంధ సంస్థల కార్యకర్తలు ఏడాది కాలంగా విస్పర్ క్యాంపెయిన్ (నిశ్శబ్ద ప్రచారం) ఈ విజయానికి ప్రధాన కారణం అయినట్లు తెలుస్తోంది. గెలుపై లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ ఈసారి సెలబ్రిటీల కంటే స్థానికంగా ఉండే ఇన్?ఫ్లుయెన్సర్లను తమ ప్రచారకర్తలుగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఆటో డ్రైవర్లు, కిరాణా దుకాణదారులు, టీ స్టాళ్ల యజమానులు, కాలనీల్లోని చిన్న చిన్న బ్యూటీ పార్లర్ల నిర్వహకులను ఎంచుకుని వారి ద్వారా ఓటర్లను ప్రభావితం చేసినట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల మధ్య చర్చకు వచ్చేలా ఈ టీమ్ లు పని చేశాయని ముఖ్యంగా ప్రయాణ సమయంలో ఆటో డ్రైవర్లు చెప్పే కట్ మనీ (ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి కమీషన్ల వసూలు) విషయాలు, బ్యూటీ పార్లర్లలో మహిళా భద్రతపై దీదీలు చేసే చర్చలు ఓటర్లలో మార్పుకు బీజానికి దారి తీసినట్లు తెలుస్తోంది. కోల్?కతాలో సుమారు 50 వేల మంది ఆటో డ్రైవర్లు గడిచిన ఏడాది కాలంలో ఈ నిశబ్ధ ప్రచారంలో భాగస్వాములు అయినట్లు చర్చ జరుగుతోంది.

**వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని:**

15 ఏళ్ల మమతా బెనర్జీ పాలన పట్ల బెంగాల్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలతో బెంగాలీ అస్తిత్వం ప్రమాదంలో పడుతోందనే చర్చ అక్కడి ప్రజల్లో ఉంది. ఈ భావనను మరింత బలంగా ఓటర్లలో నాటుకుపోయేలా చేయడంలో సంఘ్ పరివార్ విజయం సాధించినట్లు చెబుతున్నారు. ఇక బీజేపీ సైతం సంస్థాగతంగా పక్కా వ్యూహంతో ముందుకు సాగిందని సునీల్ బన్సల్, భూపేందర్ యాదవ్, విప్లవ్ దేవ్ వంటి నేతలు బెంగాల్ లో మకాం వేసి పార్టీ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించినట్లు తెలుస్తోంది. 44 వేల బూత్ లను గుర్తించి ప్రతి 30 నుంచి 60 మంది ఓటర్లకు ఒక పన్నా ప్రముఖ్ ను నియమించి అక్కడి ఓటర్లతో నిరంతరం టచ్ లో ఉండేలా వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. ఫలితంగా బీజేపీ బహిరంగ సభల కంటే నిశ్శబ్ధంగా మైక్రో స్థాయిలో జరిగిన ఈ క్యాంపెయినింగ్ బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త చరిత్రకు అంకురార్పణ చేసిందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.


# తప్పు చేస్తే కొడుకునైనా క్షమించను..
# కుమారుడి పోక్సో కేసుపై స్పందించిన బండి సంజయ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కరీంనగర్:** తన కుమారుడు బండి భగీరథ్?పై నమోదైన పోక్సో కేసుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. మంగళవారం (మే 12) కరీంనగర్?లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో బిజీ అయ్యి నా కుమారుడికి టైమ్ ఇయ్యలేకపోయానన్నారు. నా కొడుకును క్రిమినల్?గా చూపే ప్రయత్నం చేస్తున్నారని.. కానీ నేను ఏ తప్పు చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడన్నారు. అయినప్పటికీ నా కొడుకును సమర్థించడం లేదని.. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తానని తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. నిజంగా తప్పు చేసినట్లు తేలితే నా కొడుకును కూడా క్షమించనని స్పష్టం చేశారు. నా కుమారుడిపై జరుగుతున్నన దాడిని చూసి కన్న పేగు తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నా జీవితమంతా కష్టాలు, బాధలేనని.. కానీ ఎన్ని ఆటుపోట్లు ఎదురైన భయపడి పారిపోయే వాడిని కాదన్నారు. నా కుటుంబాన్ని రోడ్డుకు లాగి నా మీద కుట్రలు చేసి, నా పార్టీని ఇబ్బంది పెడుతున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కాగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్?పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. తనపై భగీరథ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ మైనర్ బాలిక ఫిర్యాదు మేరకు పేట్ బషీర్?బాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మహిళా ఐపీఎస్ ఆఫీసర్ రితిరాజ్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించారు. ఈ మేరకు సైబరాబాద్ సీపీ రమేశ్ రెడ్డి సోమవారం మెమో జారీ చేశారు.కేసుకు సంబంధించిన అన్ని అంశాలను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశీలించాలని సీపీ రమేశ్ రెడ్డి ఆదేశించారు. వృత్తిపరమైన పద్ధతిలో నిబంధనలకు లోబడి దర్యాప్తు జరిగేలా చూడాలని సూచించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలని దర్యాప్తు పురోగతి నివేదికను ప్రతిరోజూ తప్పనిసరిగా సమర్పించాలని సీపీ ఆదేశించారు. ఈ క్రమంలోనే కేసు విచారణను డీసీపీ రితిరాజ్ ముమ్మరం చేశారు.

# ఉపాధి హామీ పనులు పాత పద్ధతిలో కొనసాగాలి...

**కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం పాత చట్టాన్ని దద్దుచేసి విబి జి రాం జీ చట్టాన్ని తీసుకువచ్చిన దాన్ని రద్దు చేసి పాత పద్ధతి పాత చట్టమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి విబి జి రాం జీ చట్టాన్ని తీసుకొచ్చి దాని రద్దుచేసి పాత చట్టం అయినా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికులు గ్రామీణ ప్రాంతంలో సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని, ఉపాధి హామీ ద్వారా చెరువులో పూడికతీత గట్ల నిర్మాణాలు మట్టి పనులు రహదారులు కాలువలు నిర్మాణం పేదల భూములను అభివృద్ధి, మొక్కలు నాటడం వంటి పనుల ద్వారా ఉపాధి కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తులను పెంచుకుంటున్నారన్నారు. ఇలాంటి అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తున్న క ు ట ు ం బ ా ల న ు పోషించుకుంటున్నారని, కార్మికుల పొట్టగొట్టి ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే విబి జి రాం జీ పథకాన్ని పథకం తెచ్చి కొత్త కొత్త జీవోలతో కార్మికులను పనికి దూరం చేస్తున్నారని పని ప్రదేశాల్లో మౌలిక వసతులు ఎత్తివేసి కార్మికుల ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. చేసిన పనికి కూలి ఎంత వస్తుందో చెప్పకుండా వారం వారం డబ్బులు ఇవ్వకుండా కార్మికుల అవస్థల పాలు చేస్తున్నారని, ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికుల సమస్యలను పరిష్కరించి పాత చట్టాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ నెల 15 జరిగే గ్రామీణ సమ్మె బందును జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కట్ట రవికుమార్, మండల అధ్యక్షులు గంధమల్ల రాజయ్య, సహాయ కార్యదర్శి ఎంజాయ్ మైసయ్య, గొల్లూరి ప్రభాకర్, ముఖ్య సలహాదారుడు బి.రాములు పరమేష్, మధు, శ్రీకాంత్, ఉమా మహేశ్వర్, లక్ష్మయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వ్యక్తిగత సహాయకులు పీఏ సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో తోటి సిబ్బంది, అభిమానుల మధ్య ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరిగాయి ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బీర్ల ఐలయ్య వ్యక్తిగత సహాయకులుగా ఎంతో మంది బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్ఓసీలు అందేలా కృషి చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్న సంతోష్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరణతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ వేడుకలో పీఏ ఉపేందర్, పీఆర్వో ఆదిమూలం సురేష్, జాంగిర్, కిషన్, నవీన్, అజయ్ త్రివేది మణికంఠ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## రోగుల ఆరోగ్య పరిరక్షణలో
# నర్సుల పాత్ర కీలకం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ సమక్షంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై పండరి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్, న్యాల్‌కల్ మండల అధ్యక్షులు నవీన్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆసుపత్రి నర్సులను శాలువాలతో సన్మానించి అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ మాట్లాడుతూ నర్సులు వైద్య రంగానికి వెన్నెముకలాంటివారని, రోగుల ఆరోగ్య పరిరక్షణలో వారు అందిస్తున్న సేవలు అమూల్యమని కొనియాడారు. పగలు రాత్రి తేడా లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న ప్రతి నర్సు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు విజయ కుమారి , లక్ష్మమ్మ, శంకరమ్మ మౌనిక, పుష్ప, వెంకట్ లక్ష్మీ ,సీనియర్ జర్నలిస్టులు విఠల్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు మ్యాపింగ్ వేగవంతం చేయాలి : కలెక్టర్ హరిత సమీక్ష



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కె.హరిత సిర్పూర్ నియోజకవర్గ మండలాల తహసిల్దార్లు, ఏపీఎంలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పంచాయతీ కార్యదర్శులు బూత్ స్థాయి అధికారులకు పూర్తి సహకారం అందించాలని నిర్దేశించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు, గోనె సంచుల లభ్యత, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ధ్రువపత్రాల జారీ, పెండింగ్ అంశాలపై తహసిల్దార్లతో సమీక్ష జరిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని, అకాల వర్షాల నేపథ్యంలో గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ధ్రువపత్రాలు నిర్ణీత గడువులోగా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు




# ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామంలో ఉపాధి హామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పరిశీలించింది. ఈ నెల 15న గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట నిరసనలు, 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు.ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించి, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు, న్యాయమైన వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, కూలీలు పాల్గొన్నారు.



## రౌతు సంకేపల్లిలో అభివృద్ధి పరిశీలన

### గిరిజన రైతుల సమస్యలు వినిపించిన గ్రామస్తులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రౌతు సంకేపల్లి గ్రామం గత 8 నెలలుగా రాష్ట్ర గవర్నర్ మార్గదర్శకత్వంలో అభివృద్ధి పథంలో సాగుతోంది.మంగళవారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. భూ పట్టాలు, త్రాగునీరు, రహదారులు, వ్యవసాయ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.గ్రామస్తులు తమ సమస్యలను అధికారి దృష్టికి తీసుకువచ్చారు. మృతుల అటవీ భూ పట్టాలను వారసుల పేర్లకు మ్యూటేషన్ చేయాలని, ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న పేద గిరిజన కుటుంబాలకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అటవీ శాఖ ఆంక్షల వల్ల పట్టా భూముల్లో సాగుకు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. కొలం గూడ ప్రాంతంలో తీవ్రమైన త్రాగునీటి సమస్య పరిష్కారానికి, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విన్నవించారు. అనంతరం అధికారి రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని కొలం గూడ మల్టీపర్పస్ సెంటర్‌ను సందర్శించి సేవలు, నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు.

## ఏబీ స్విచ్‌లతో విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు ఏబీ స్విచ్‌ల ఏర్పాటును వేగవంతం చేసినట్లు ఎస్ఈ ఉత్తమ్ జాడే తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో సింగిల్ ఫేజ్, త్రిఫేజ్ లైన్లకు ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడంతో ఫాల్ట్ వచ్చిన ప్రాంతంలో మాత్రమే విద్యుత్ నిలిపివేసి, మిగతా ప్రాంతాలకు నిరంతరాయ సరఫరా అందిస్తున్నామని చెప్పారు.ఈ సాంకేతికతతో ట్రిప్పింగ్ సమస్యలు తగ్గి, లోపాలను త్వరగా గుర్తించి మరమ్మతులు చేపట్టే అవకాశం ఏర్పడిందన్నారు. అత్యవసర విద్యుత్ సమస్యల కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నర్సెస్ డే వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** ఆసిఫాబాద్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ నర్సెస్ డే వేడుకలు నిర్వహించారు. భరోసా ఇంచార్జ్ ఎస్సై దివ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా నర్సుల సేవలు, త్యాగాలు, వృత్తి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, భరోసా టీం సభ్యులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad


## "హనీ ట్రాప్" పేరుతో కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది :

### ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : కొడుకు ఫోక్సో కేసు వ్యవహారంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విస్మయం కలిగిస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హైదరాబాద్ లోని సీఎల్పీ లో జరిగిన మీడియా సమావేశంలో మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉన్న ఆయన ఇప్పటివరకు తన కుమారుడిపై నమోదైన కేసు విషయంలో స్పష్టంగా స్పందించలేదు. రాష్ట్రంలో ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించే బండి సంజయ్, ఇప్పుడు మాత్రం మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. "హనీ ట్రాప్" పేరుతో అసలు కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన కుమారుడి తప్పును కప్పిపుచ్చేందుకు కేసును మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. నిజంగా తన కుమారుడు నిర్దోషి అయితే, తాను విశ్వసించే శ్రీరాముడి పేరిట బహిరంగంగా ప్రమాణం చేసి చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చి ప్రమాణం చేస్తే మరింత స్పష్టత వస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం బండి భగీరథ్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంటే వెంటనే అతడిని లొంగిపోయేలా చూడాలని, క్రమశిక్షణ గల నాయకుడైతే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.బండి సంజయ్ తరచూ శ్రీరాముడి సుగుణాల గురించి ప్రజలకు బోధిస్తుంటారని, కానీ అదే విలువలను తన కుటుంబంలో అమలు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. గత కొంతకాలంగా భగీరథ్ ప్రవర్తనపై సోషల్ మీడియాలో అనేక వీడియోలు వైరల్ అవుతున్నాయని, మద్యం సేవించడం, దాడులకు పాల్పడడం, ఇప్పుడు లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇంత జరుగుతున్నా బండి సంజయ్ స్పందించకపోవడం గమనార్హం. నీతి సూత్రాలు ఇతరులకు చెప్పడానికే కాకుండా, స్వయంగా ఆచరించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఆయన విస్మరించినట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, బాధితురాలు మరియు ఆమె కుటుంబ సభ్యులను బెదిరించారనే వార్తలు కూడా వెలువడుతున్నాయి. మీడియా మేనేజ్‌మెంట్‌కు కూడా ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బెజ్జూర్ మండల కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిడెం సకారం, బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్ విద్యను అభ్యసించాలని సూచించారు. అడ్మిషన్ల కోసం 8639460731 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

## భూపతి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన ఇంజ మహేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** జర్నలిస్ట్ భూపతి శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం రాజపేట మండలం బూరుపల్లి గ్రామంలో కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అనంతరం భూపతి రామయ్య ఫోటోను శ్రమ శక్తి అవార్డు గ్రహీత ఇంజ మహేష్ జర్నలిస్టు భూపతి శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, ఎండి యూసుఫ్, చీర మహిపాల్ తదితరులు పాల్గొన్నారు


# మదర్ డెయిరీ అభివృద్ధికి కీలక ఒప్పందం

### బీర్ల ఐలయ్య కృషితో మదర్ డెయిరికి భారీ ప్రోత్సాహం..

### పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 12, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మదర్ డెయిరీ అభివృద్ధి మరియు పాడి రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్.డి.డి.బి) మరియు మదర్ డెయిరీ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు వాకిటీ శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలాంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, అలాగే ఎన్.డి.డి.బి. సంస్థకు చెందిన సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్, సౌత్ రీజినల్ హెడ్ ఆర్మీ జకబ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ కుమార్ పాల్గొని విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం పరస్పర సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటీ శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య పాత్ర పోషించారు. వారి సమన్వయంతో పాడి రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు అధికారులు మదర్ డెయిరీ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల చెక్కును మంత్రి వాకిటీ శ్రీహరి, విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా మదర్ డెయిరీ ప్రతినిధులకు అందజేశారు. ఈ నిధులతో పాల సేకరణ కేంద్రాల విస్తరణ, శీతలీకరణ కేంద్రాల ఆధునీకరణ, రైతులకు సాంకేతిక సౌకర్యాల కల్పన, పాడి పరిశ్రమ విస్తరణ, అలాగే పెండింగ్‌లో ఉన్న రైతుల బిల్లుల చెల్లింపులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..."తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. పాడి రైతులు ఆర్థికంగా బలపడాలంటే పాల ఉత్పత్తి రంగాన్ని ఆధునికీకరించడం అత్యంత అవసరం. ఎన్.డి.డి.బి. మరియు మదర్ డెయిరీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించడం, పాల సేకరణను పెంచడం, ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాడి రంగాన్ని మరింత బలోపేతం చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి యువతకు కూడా ప్రయోజనం చేకూరుతుంది" అని పేర్కొన్నారు.



# సరికొత్త టేస్ట్‌నిచ్చే “మామిడికాయ రోటి పచ్చడి”

## - అన్నంతో పాటు టిఫిన్స్ లోకి సూపర్!



ఈ సీజన్ లో మామిడికాయలు విరివిగా దొరకుతుంటాయి. ఈ క్రమంలోనే చాలా మంది వాటితో పప్పు, పచ్చడి, రసం, పులిహోర అంటూ రకరకాల వెరైటీలు ట్రై చేస్తుంటారు. అందులోనూ మెజార్టీ పీపుల్ ‘నిల్వ పచ్చడి’ ఎక్కువగా పెడుతుంటారు. అవి మాత్రమే కాకుండా ఓసారి ఇలా “మామిడికాయ రోటి పచ్చడి” ట్రై చేయండి. ఇది భలే కమ్మగా ఉండి ఇంటిల్లిపాదీకి చాలా బాగా నచ్చేస్తుంది. వేడి వేడి అన్నంలోకి నెక్స్ట్ లెవల్ టేస్ట్ నిస్తుంది. ఈ పచ్చడి అన్నంలోకి మాత్రమే కాకుండా ఇడ్లీ, దోశ వంటి టిఫెన్స్‌లోకి కూడా బాగుంటుంది. మరి, లేట్ చేయకుండా ఈ నోరూరించే మామిడికాయ పచ్చడిని ఎలా చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు :**

పచ్చిమామిడికాయలు - నాలుగు(మీడియం సైజ్ వి)
మెంతులు - అరటీస్పూన్
జీలకర్ర - ఒక టీస్పూన్
ఆవాలు - రెండు టీస్పూన్లు
దొడ్డు ఉప్పు - రుచికి తగినంత
వెల్లుల్లి రెబ్బలు - 10
కారం - టేస్ట్‌కు సరిపడా
పసుపు - అరటీస్పూన్

**తయారీ విధానం :**

ఈ రెసిపీ కోసం ముందుగా తాజా పచ్చిమామిడికాయలను ఒకటికి రెండుసార్లు రుద్దుతూ బాగా కడగాలి.ఆపై వాటిని తొక్కను అలాగే ఉంచి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి.అనంతరం పచ్చడిలోకి అవసరమైన ఒక స్పెషల్ మసాలా పొడిని రెడీ చేసుకోవాలి.ఇందుకోసం స్టవ్ మీద కడాయిలో మెంతులు వేసి లో ఫ్లేమ్?లో దోరగా వేయించుకోవాలి.అవి వేగాక అందులో ఆవాలు, జీలకర్ర వేసి చక్కగా వేయించుకుని ఒక చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.ఇప్పుడు శుభ్రంగా కడిగి వాటర్ లేకుండా తుడుచుకున్న రోలు తీసుకుని అందులో చల్లారిన జీలకర్ర మిశ్రమం, రుచికి తగినంత ఉప్పు వేసుకుని మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకోవాలి.ఆ తర్వాత దాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి.నెక్స్ట్ అదే రోలులో పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలు, కట్ చేసి పెట్టుకున్న వాటిలో సగం మామిడికాయ ముక్కలు వేసుకుని కచ్చాపచ్చాగా దంచుకోవాలి.మామిడి ముక్కలు కొంచెం నలిగేలా దంచుకున్నాక అందులో రుచికి తగినంత కారం, పసుపు, మిగిలిన మామిడికాయ ముక్కలు వేసుకుని అక్కడక్కడా చిన్న చిన్న మామిడి పలుకులు కనిపించేలా మెత్తగా దంచుకుని ఒక గిన్నెలోకి తీసుకోవాలి.ఇప్పుడు పచ్చడిలోకి పోపును రెడీ చేసుకోవాలి.

**తాలింపు కోసం :**

ఆయిల్ - ఆరేడు టేబుల్‌స్పూన్లు
శనగపప్పు - ఒక టీస్పూన్
మినప్పప్పు - ఒక టీస్పూన్
జీలకర్ర - ఒక టీస్పూన్
ఆవాలు - కొద్దిగా
వెల్లుల్లి రెబ్బలు - పది
ఇంగువ - అరటీస్పూన్
ఎండుమిర్చి - ఆరేడు
కరివేపాకు - కొద్దిగా

పచ్చడిలోకి పోపు కోసం స్టవ్ మీద కడాయిలో నూనె వేసి వేడి చేసుకోవాలి. ఆయిల్ హీట్ అయ్యాక పచ్చిశనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఆవాలు వేసుకుని వేయించుకోవాలి.అవన్నీ లైట్‌గా వేగాక కచ్చాపచ్చాగా దంచిన వెల్లుల్లి రెబ్బలు వేసి పచ్చివాసన పోయేలా కాస్త ఫ్రై చేయాలి.ఆ తర్వాత ఇంగువ, ఎండుమిర్చి తుంపలు, కరివేపాకు వేసుకుని పోపును మంచిగా వేయించుకోవాలి.తాలింపు చక్కగా వేగాక ముందుగా దంచి పెట్టుకున్న మామిడికాయ ముద్దను వేసి ఒకసారి అంతా బాగా కలిసేలా మిక్స్ చేసుకోవాలి.ఆ తర్వాత అందులోనే ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న ఆవాలు-జీలకర్ర పొడి మిశ్రమం వేసుకుని మరోసారి అంతా కలిసేలా బాగా కలుపుకోవాలి.ఇక చివరగా టేస్ట్ చేసుకుని ఉప్పు చాలకపోతే కాస్త వేసుకుని కలిపి దింపేసుకుంటే చాలు.అంతే, పచ్చిమామిడితో అప్పటికప్పుడు కమ్మని “రోటి పచ్చడి” రెడీ అవుతుంది!ఈ పచ్చడిని అలాగే బయట ఉంచితే నాలుగైదు రోజులపాటు, ఫ్రిడ్జ్‌లో ఉంచితే వారం పది రోజుల పాటు తాజాగా నిల్వ ఉంటుంది! మరి, నచ్చితే మీరూ ఈ సమ్మర్?లో రెగ్యులర్ కూరలు కాకుండా ఓసారి ఇలా పచ్చడి చేసుకుని చూడండి.ఒకవేళ మీకు రోలు లేనట్లయితే మిక్సీలో ఇదే పద్ధతి ఫాలో అవుతూ ప్రిపేర్ చేసుకోవచ్చు.

# టేస్టీ టేస్టీ “ఫలూదా” ఇంట్లోనే!

## ఇలా ఈజీగా తయారు చేసుకోండి





ఐస్ క్రీం, మిల్క్‌షేక్, ఫ్రూట్‌సలాడ్ ఇందులో దేని ఫ్లేవర్ దానిదే. కానీ, వీటన్నింటినీ కలిపి తిన్న ఫీలింగ్ రావాలంటే మాత్రం ఒకే ఒక్క ఐటమ్ ఉంది. అదే “ఫలూదా”. ఈ మ్యాజిక్ ఐటమ్‌కు సమ్మర్‌లో ఉన్న డిమాండే వేరు. అయితే, బయట వాళ్లు ఎలా తయారు చేస్తారో తెలియదు. అందుకే, మనం ఇంట్లోనే తయారు చేసుకుంటే ఎలా ఉంటుంది? అద్దిరిపోతుంది కదా! మరి, ఈ రెసిపీని తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలేంటి? తయారు చేసే పద్ధతేంటి? అన్నది ఇప్పుడు చూద్దాం.

**కావలసిన పదార్థాలు :**

పాలు - ఒక లీటరు
రోజ్ సిరప్ - ఫలూదాకు రంగు, రుచిని ఇచ్చే ప్రధాన ద్రవం
సేమియా - మొక్కజొన్న పిండితో చేసిన సన్నని సేమియా
సబ్జా గింజలు - నీటిలో నానబెట్టినవి
ఐస్‌క్రీం - వెనిలా (లేదా మీకు నచ్చిన ఫ్లేవర్)
డ్రై ఫ్రూట్స్ - జీడిపప్పు, పిస్తా, బాదం పలుకులు
పండ్ల ముక్కలు, కోవా, గుల్కంద్

**తయారీ విధానం:**

ముందుగా ఒక మందంపాటి గిన్నె తీసుకొని స్టవ్ మీద పెట్టి, పాలు పోసి అవి చిక్కగా అయ్యే వరకు మరిగించాలి. ఆ తర్వాత వాటిని చల్లార్చుకోవాలి. మార్కెట్లో దొరికే ఇన్‌స్టంట్ ఫలూదా పొడిని కూడా ఇందులో వాడుకోవచ్చు.ఆ తర్వాత ఫలూదా సేమియాను విడిగా ఉడికించాలి. వాటిని వడకట్టి పక్కన ఉంచుకోవాలి. అనంతరం ఒక పొడవైన గాజు గ్లాసు తీసుకుని, అందులో అడుగున రోజ్ సిరప్ వేయాలి. దానిపై నానబెట్టిన సబ్జా గింజలను ఒక పొరలా వేయాలి.

ఆ తర్వాత ఉడికించిన సేమియా వేయాలి. దానిపై నుంచి ముందుగా చిక్కగా మరిగించుకున్న పాలను పోయాలి.గ్లాసు పైభాగంలో ఒక స్కూప్ ఐస్‌క్రీం వేసి, దానిపై డ్రై ఫ్రూట్స్ పలుకులు, పండ్ల ముక్కలతో అలంకరించాలి.అంతే, అద్దిరిపోయే ఫలూదా సిద్ధమైపోతుంది.ఫలుదాలో ఉండే పాలు, డ్రై ఫ్రూట్స్ శరీరానికి కావాల్సిన ప్రొటీన్, క్యాల్షియం, ఐరన్ అందిస్తాయి.సబ్జా గింజలు శరీర వేడిని తగ్గించి, వడదెబ్బ తగలకుండా కాపాడతాయి.సబ్జాలోని పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను చాలా మెరుగుపరుస్తుంది.రోజ్ సిరప్‌లోని ఫ్లేవనాయిడ్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడతాయి.ఐస్‌క్రీం కంటే స్వీట్?గా, మిల్క్‌షేక్ కంటే చిక్కగా ఉంటూ అద్దిరిపోయే ఈ ఫలూదా పర్షియాలో పుట్టింది. అంటే నేటి ఇరాన్?లో. మొఘల్ రాజుల ద్వారా ఈ డెజర్ట్ మన దేశానికి పరిచయమైంది.దీన్ని ఎప్పుడు తాగినా అద్భుతంగా ఉంటుంది. ప్రత్యేకంగా వేసవిలో దీనికి ఫుల్ డిమాండ్ ఉంటుంది. తాపాన్ని తగ్గించడంలో ఇది ఒక శక్తివంతమైన పోషక పానీయంగా మారిపోయింది.రుచితో పాటు ఆరోగ్యాన్ని అందించే ఈ చల్లని ఫలూదాను ఈ వేసవిలో మీరు కూడా తప్పక ఆస్వాదించండి.పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా పిల్లలు ఒకటికి రెండు గ్లాసులు తాగేస్తారు. మీకు నచ్చితే తప్పకుండా ఇంట్లో ట్రై చేయండి.

# నోరూరించే “బిల్లల పులుసు”

## అమ్మమ్మల నాటి పద్ధతిలో టేస్ట్ అద్దిరిపోతుంది!



సమ్మర్‌లో చాలా మందికి పులుసు కూరలైతేనే నాలుగు ముద్దలు ఎక్కువగా తినాలనిపిస్తుంది. ఈ క్రమంలోనే మెజార్టీ పీపుల్ పచ్చి పులుసు, సాంబార్, రసం, మజ్జిగ పులుసు వంటివి రెడీ చేసుకుంటుంటారు. అలాగని ఎప్పుడూ అవే తినాలన్నా నచ్చకపోవచ్చు. అందుకే, మీకోసం ఇప్పటివరకు ట్రై చేయని ఒక నయా రెసిపీని తీసుకొచ్చాం. అదే, అమ్మమ్మల నాటి “బిల్లల పులుసు”. సరికొత్త ఫ్లేవర్‌తో సూపర్ టేస్టీగా ఉంటుంది. ఒక్కసారి టేస్ట్ చేశారంటే మళ్లీ మళ్లీ చేసుకోవాలనిపిస్తుంది. చిక్కని గ్రేవీతో వేడి వేడి అన్నంలోకి వావ్ అనిపిస్తుంది. అలాగే, దీని ప్రిపరేషన్ కూడా చాలా సింపుల్. మరి, లేట్ చేయకుండా నోరూరించే ఈ పాతకాలం నాటి పసందైన బిల్లల పులుసును ఎలా రెడీ చేసుకోవాలి? అందుకు కావాల్సిన పదార్థాలేంటో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు :**

**బిల్లల తయారీకి :**

రెండు కప్పులు - శనగపిండి
అర టీస్పూన్ - పసుపు
రెండు టీస్పూన్లు - కారం
రుచికి తగినంత - ఉప్పు
ఒక టీస్పూన్ - ధనియాలపొడి
కొద్దిగా - గరంమసాలా
ఒక టీస్పూన్ - అల్లంవెల్లుల్లి పేస్ట్

**కర్రీ తయారీకి :**

ఆయిల్ - నాలుగైదు టేబుల్ స్పూన్లు
కొద్దిగా - ఆవాలు
ఒక టీస్పూన్ - జీలకర్ర
అర టీస్పూన్ - మెంతులు
రెండు - ఉల్లిపాయలు (చిన్న సైజ్‌వి)
కొద్దిగా - కరివేపాకు
రెండు టీస్పూన్లు - అల్లం
కొంచెం - పసుపు
కారం - తగినంత
టేస్ట్?కు సరిపడా - ఉప్పు
పెద్ద నిమ్మకాయంత - చింతపండు
కొద్దిగా - కొత్తిమీర తరుగు

**తయారీ విధానం :**

పాతకాలం నాటి ఈ రుచికరమైన కర్రీ తయారీ కోసం ముందుగా బిల్లలు ప్రిపేర్ చేసుకోవాలి.ఇందుకోసం ఒక వెడల్పాటి మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులో శనగపిండి, పసుపు, కారం, టేస్ట్ సరిపడా ఉప్పు వేసుకుని ఒకసారి అంతా కలిసేలా మిక్స్ చేసుకోవాలి.ఆపై అందులోనే ధనియాలపొడి, గరంమసాలా, అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసుకుని మరోసారి కలపాలి.ఆ తర్వాత అవసరం మేరకు కొద్దికొద్దిగా వాటర్ యాడ్ చేసుకుంటూ చపాతీ పిండి ముద్దలా కలుపుకోవాలి. ఇలా కలిపాక కొద్దిగా నూనె రాసి పది నిమిషాలు పక్కనుంచాలి.ఆ లోపు రెసిపీలోకి అవసరమైన మసాలా పేస్ట్ ను రెడీ చేసుకోవాలి.

**మసాలా పేస్ట్ కోసం :**

రెండు టేబుల్ స్పూన్లు - ధనియాలు
ఒక టీస్పూన్ - జీలకర్ర
అర టీస్పూన్ - మెంతులు
నూనె - కొద్దిగా
రెండు - ఉల్లిపాయలు (పెద్ద సైజ్‌వి)

ఇందుకోసం స్టవ్ మీద కడాయిలో మొదటగా ధనియాలు, జీలకర్ర, మెంతులు వేసుకుని సన్నని సెగ మీద దోరగా వేయించుకోవాలి. ఆపై వాటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని పక్కనుంచాలి.అవి చల్లారేలోపు అదే కడాయిలో కొద్దిగా నూనె వేసి వేడయ్యాక కట్ చేసి పెట్టుకున్న ఉల్లిపాయ ముక్కలు వేసుకుని రంగు మారే వరకు వేయించుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.అనంతరం మిక్సీ జార్ తీసుకుని అందులో చల్లారిన ధనియాల మిశ్రమం, వేయించిన ఉల్లిపాయలు వేసుకుని కొద్దిగా నీళ్లు పోసుకుని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. దాంతో మసాలా పేస్ట్ రెడీ అవుతుంది.ఇప్పుడు చేతులకు కాస్త నూనె రాసుకుని పది నిమిషాల పాటు పక్కనుంచిన శనగపిండి ముద్దను కొద్దికొద్దిగా తీసుకుంటూ చేతులతో బిల్లలు చేసుకోవాలి.ఇక్కడ బిల్లలను మీకు నచ్చిన షేప్?లో రెడీ చేసుకోవచ్చు. ఇందుకోసం చపాతీలకంటే మందంగా రోల్ చేసుకుని వివిధ ఆకారాల్లోకి కట్ చేసుకోవచ్చు.అయితే, ఈ బిల్లలు మరీ చిన్నగా, పెద్దగా కాకుండా చూసుకోవాలి. ఇలా పిండి మొత్తాన్ని చిన్న చిన్న బిల్లలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి.అనంతరం కర్రీ తయారీకి స్టవ్ మీద కడాయిలో తగినంత నూనె వేసి వేడి చేసుకోవాలి.ఆయిల్ హీట్ అయ్యాక ఆవాలు, జీలకర్ర, మెంతులు వేసి వేయించాలి. అవి లైట్‌గా వేగాక ఉల్లిపాయ ముక్కలు, కరివేపాకు, అల్లం, పసుపు వేసి సన్నని సెగ మీద ఒకట్రెండు నిమిషాలు కలుపుతూ ఫ్రై చేసుకోవాలి.ఆ తర్వాత ముందుగా రెడీ చేసి పెట్టుకున్న మసాలా పేస్ట్ వేసుకుని అర నిమిషం కలుపుతూ వేయించుకోవాలి.ఆపై అందులో కారం పొడి, రుచికి తగినంత ఉప్పు వేసుకుని ఒక నిమిషం ఫ్రై చేసుకోవాలి.అనంతరం చింతపండు రసం వేసుకుని కలిపి మూడు నిమిషాలు మరిగించుకోవాలి.ఆ తర్వాత తగినన్ని నీళ్లు యాడ్ చేసుకుని కలిపి మరో రెండు నిమిషాలు హై-ఫ్లేమ్ లో మరిగించుకోవాలి.పులుసు మంచిగా మరిగిన తర్వాత ముందుగా రెడీ చేసి పెట్టుకున్న బిల్లలను వేసుకుని రెండు మూడు నిమిషాలు కదపకుండా ఉడికించుకోవాలి.నెక్స్ట్ మంటను సిమ్ లో పెట్టుకుని మరో ఐదారు నిమిషాలు మరిగించుకుంటే పులుసులు చిక్కబడి బిల్లలు ఉడికిపోతాయి.బిల్లల సాఫ్ట్ గా ఉడికాయనుకున్నాక చివరగా కాస్త కొత్తిమీర తరుగు వేసుకుని మరో నిమిషం ఉంచి దింపేసుకుంటే చాలు.అంతే, అమ్మమ్మల పద్ధతిలో ఘుమఘుమలాడే “బిల్లల పులుసు” సింపుల్ గా రెడీ అవుతుంది!.మరి, నచ్చితే మీరూ ఈ స్టైల్ లో ఓసారి శనగపిండితో ఇలా బిల్లల పులుసు చేసుకుని చూడండి. ఇంటిల్లిపాదీ ఎంతో ఇష్టంగా తింటారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.